# 22. మనసెరిగిన మనిషి

**కూ**తురు పెళ్ళి ఘనంగా చేయాలనుకున్న ఓ పెద్దమనిషికి ఓ తాగుబోతు సన్నాయి మేళం దొరికింది. కాబోయే వియ్యంకుడు ఆ తాగుబోతుని ససేమీరా పెళ్ళి పందిట్లోకి రానీయ వద్దన్నారు. మరి ఆ పెద్దమనిషి కూతురు పెళ్ళి చేశాడా లేదా?

పెళ్ళి చూపులు ముగిశాయి.

పెళ్ళికొడుకు పిల్లను నచ్చుకోవడమే కాక అతని తల్లిదండ్రులు, ఇద్దరక్కయ్యలు నచ్చుకున్నారు.

పెళ్ళిచూపు లయిన అర్థగంటలోనే వాళ్ళు తమ అభిప్రాయం మాకు తెలియజేశారు.

ప్రొఫెసరు మూర్తిగారికి ఒక్కడే కుమారుడు. అతను కూడా డాక్టరేటు పట్టం పుచ్చుకొని ఈ మధ్యనే యూనివర్శిటీలో లెక్చరరుగా చేరాడు.

ప్రొఫెసరు మూర్తి గారు పెళ్ళికూతురు నచ్చిందని చెప్పడమే కాకుండా, ఒక పైసా కూడా కట్నం తీసుకోమన్నారు. వారి అల్లుళ్ళు ఇద్దరూ పెద్ద ఉద్యోగాలే చేస్తున్నారు. అందుచేత ఆడపడుచులకు కూడా కట్నాలు అక్కర్లేదన్నారు.

పెళ్ళినాడు ఉదయం ఏడు గంటలకు విశాఖపట్నం నుండి బస్సులో వస్తామని, పెండ్లి అయిన ఉదయమే వెళ్ళిపోతామని, నిరాడంబరంగా కళ్యాణం జరిపించవలసిందని ఆయన అప్పుడే చెప్పారు.

జాతకాలు ముందే చూపించడం చేత పెళ్ళి ముహూర్తం పెట్టించడం మాత్రమే మిగిలింది. ప్రొఫెసరుగారు విశాఖపట్నం వెళ్ళిన నాలుగు రోజుల్లోనే ముహూర్తం పెట్టించి పంపారు.

మార్చి తొమ్మిదో తారీకు రాత్రి ఒంటిగంట నలభై అయిదు నిమిషాలకు దైవజ్ఞులు ముహూర్తం నిశ్చయించారు.

ఆడపిల్ల తండ్రికి ఇంతకన్నా అదృష్టమేముంది.!

నా కున్నది ఒక్కర్తే ఆడపిల్ల. మంచి చదువే చెప్పించాను. వీణ నేర్పించాను. ఇంటి పనులు శ్రద్ధగా చేయగల సామర్థ్యం మా అమ్మాయికి బాగా అలవడింది. రూపానికి మా అమ్మాయి ఎవరికీ తీసిపోదు.

నాకు హెడ్మాస్టరు పదవి నుండి విరమించడానికి ఒక్క సంవత్సరం మాత్రమే ఉంది.

విజయనగరానికి సమీపంలో పెద్ద గ్రామముంది. అది పట్టణం కన్న చిన్నది. అక్కడ కోపరేటివ్ కాలనీలో పెద్ద ఇల్లు కట్టుకున్నాను. ఇంటి ముందు చాలా జాగా విడాచి పెట్టాను. పెరటిలో నుయ్యి, మొక్కలు మొదలైనవన్నీ ఉన్నాయి.

మా అమ్మాయిని ఇంతకు ముందు ఎవరికీ చూపించలేదు. చూసిన తొలి సంబంధమే స్థిరమయింది. నాకు ఊళ్ళో మంచి పలుకుబడి ఉంది. ఎంతో మంది సహాయం చేయడానికి ఉవ్విళ్ళూరుతున్నారు.

అన్నిటి కన్నా ముఖ్యమైంది ప్రొఫెసరు మూర్తిగారు నాకు వియ్యంకులుగా లభించడం. ఆయన ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేశారేమో, అనుభవంలో నాకన్న మిన్న అవడం చేత అన్ని విధాల సహకారం చేయడానికి ముందుకొచ్చారు.

పెళ్ళికి కావలసిన అన్ని ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. విడిదికి కొత్తగా కట్టిన పెద్ద ఇల్లు మా కాలనీలోనే దొరికింది. నలభీమ పాకంలో ఆరితేరిన సుబ్బయ్యగారు, వారి బృందం వంటకు కుదిరారు. మైకు,అలంకరణ తప్పవుగదా! వాటి గురించి కూడా పెద్ద ఆర్భాటం చెయ్యవద్దన్నారు ప్రొఫెసరుగారు.

ఘనాపాఠీ శైనులు గారిని పురోహితులుగా రమ్మని కోరాను. కూరలకు, అరిటాకులకు ఏర్పాటులు చేశాను. భోజనాలు టేబిళ్ళమీద చేయడానికి నిర్ణయమయింది. అందుచేత వడ్డించే వాలంటీర్లబృంద మొకటి తయారు చేశాను. పెళ్ళి వారికి స్వాగతం చెప్పడం, అతిథులను రిసీవ్ చేసుకోడం నేనూ, నా తమ్ముడూ నిర్వహించదలచాం.

పెళ్ళివారు ఉదయం వచ్చిన దగ్గరినుంచీ మరునాడు వెళ్ళిపోయే వరకు ఏ యే పనులు ఏక్రమంలో చేయాలో సమగ్రంగా నా నలుగురు అసిస్టెంట్లతో చర్చించి కార్యక్రమం రూపొందించాను.

శుభలేఖలు ముద్రింపించడం, దూరపు బంధువు లందరికీ పోస్టులో పంపడం మా స్కూలు హెడ్మాస్టా గారికి అప్పగించాను. అతను చాలా నమ్మకమైనవాడు. ఎటువంటి లోపం రానీయడు.

బట్టలు కొనడం, సరుకులు కొని బాగు చేయించడం, వీధిలో వెయ్యవలసిన పెద్ద పందిరికి రాటలు, తాటి కమ్మలు తెప్పించడం - ఇలా ఇలా చాలా చాలా పనులు చేయిస్తున్నాను.

ఆవేళ ఫిబ్రవరి ఇరవయ్యో తారీఖు.

పెళ్ళి రెండు వారాలే ఉంది.

అన్ని విధాలా ప్రోత్సాహకరమైన అభివృద్ధే కనిపిస్తున్నది.

ఆ రోజు ప్రొద్దుట పదకొండు గంటలకు బస్సులో మా వియ్యంకులు ఏ కబురూ చేయకుండా వచ్చిపడ్డారు. నాకు ఆయన రాక తెలిసి ఇంటికి వచ్చేసరికి పన్నెం డయింది.

అంతవరకు ఆయన కుర్చీలో కూర్చోలేదు. మంచినీళ్ళు కూడా తాగలేదు. పైని అంతగా ఎండ లేకపోయినా ముఖం మీది చెమటలు తుడుచుకుంటూ వీధి వరండాలో పచారులు చేస్తున్నారు.

కుశల ప్రశ్నలు కాకుండా, కుర్చీలో కూర్చోకుండా, నిలబడే ఆయన మాట్లాడడం మొదలు పెట్టారు.

"బావగారూ ! ఇవాళ శుభలేఖలు ఎవరెవరకి పంపించామో తిరిగి సరిచూస్తున్నప్పుడు నా కొక సంగతి జ్ఞాపకం వచ్చింది. వెంటనే మీ ఊరికి బయలుదేరి వచ్చాను. మీరు బాండు మేళం స్థిరం చేశారా?"

"స్థిరం చేశాను. ఈ తొమ్మిదో తారీకు ముహూర్తం తరువాత మూఢం వస్తున్నదని, ఈ సంవత్సరానికి ఇదే ఆఖరి మూహూర్తమని వేలకొలది పెళ్ళిళ్ళు జరుగుతాయని, అందుచేత పౌరోహిత్యులు, వంట బ్రాహ్మణులు, బాండుమేళం - ముందుగానే కుదిర్చాను. వీళ్ళందరికీ అడ్వాన్సులు కూడా ఇచ్చాను."

"ఎవరి బాండు మేళం నిశ్చయం చేశారు?"

"ఇం కెవరిది చేస్తాం? ఈ ప్రాంతాలలో రామస్వామి మేళమే పేరున్నది. దానినే నిశ్చయించాను."

"నే ననుకున్నంత పనీ అయింది!"

మా వియ్యంకులు కుర్చీలో కూలబడ్డారు. ముఖం మీద చెమటలు తుడుచుకున్నారు. గ్లాసుడు మంచినీళ్ళు తాగారు.

"బావగారూ! మీతో ఒక సంగతి చెప్పక తప్పదు. ముందుగానే మీకీ విషయం చెప్పి ఉండవలసింది. కాని, నేను మరచిపోయాను. ఇది నా పొరబాటు."

అంత పెద్ద ప్రొఫెసరు గారు ఈ విధంగా ఖేదం చెందుతుంటే నేను కూడా కలవర పడ్డాను.

"అయ్యా! ఇప్పటికీ మించిపోయింది లేదు. విషయ మేమిటో చెప్తే నేను ఆ విధంగా నడుచుకుంటాను."

"బావగారూ! నేను క్రిందటి సంవత్సరం, అటు క్రింది సంవత్సరం ఈ ఊళ్ళో జరిగిన పెళ్ళిళ్ళకు హాజరయ్యాను. ఆ పెళ్ళిళ్ళు చేసిన వాళ్ళు కూడ మీకు మల్లే రామస్వామి బాండు మేళాన్నే కుదుర్చుకున్నారు. అటు క్రిందటి సంవత్సరం మీ రామస్వామి తప్ప తాగి పెళ్ళి పందిర్లో నానా హంగామా చేశాడు. క్రిదటి సంవత్సరం జరిగిన పెళ్ళిలో చాలా హీనంగా ప్రవర్తించాడు. తప్ప తాగి పెళ్ళికి వచ్చిన కలెక్టరు గారి మీద పడి వాంతి చేసుకున్నాడు. పెళ్ళిలో ఇంత రసాభాస జరగడం నేనింత వరకూ చూడలేదు. అందు చేత నాకు రామస్వామి మేళ మంటే అసహ్యం పుట్టుకొచ్చింది."

నేను చాలా ఇరకాటంలో పడ్డాను.

"ఎవరింటి పెళ్ళిలోనో ఇటువంటిది జరిగితే నేనుభరించలేక పోయాను కదా, మా అబ్బాయి పెళ్ళిలో అది సంభవిస్తే ఏం చెప్పేది?"

జవాబు చెప్పడానికి నా దగ్గిర ఏ మాటలు మిగల లేదు.

"మా అబ్బాయి పెళ్ళికి వైస్ ఛాన్సలరు గారు, రిజిస్ట్రార్ గారు, నాతో పని చేసే ప్రొఫెసర్లు, లెక్చరర్లు, పై స్థాయిలో ఉన్న కొంత మంది స్నేహితులు వస్తున్నారు. ఈ తాగుబోతు అసభ్యంగా ప్రవర్తించడానికి మంచి అవకాశముంది. రాత్రి భోజనాలయిన దగ్గర నుంచి ముహూర్తం వరకు చాలా ఖాళీ ఉంది. ఈ ప్రబుద్ధుడు వెర్రి వెర్రి వేషాలేసి తందనాలాడితే నా పరువు పోతుంది. ఇంత కన్న మీ కేం చెప్పడం?" అతను నా చేతులు పట్టుకున్నారు. "ఇటు వంటి అవమానం కన్నా బాండు మేళం లేకపోయినా పరవాలేదు. ఏ సన్నాయిమేళమో కుదర్చండి. ఒక వేళ అది కూడా దొరక్క పోతే ఏ రికార్డో వాయించి పెళ్ళి జరిపించండి. అంతే కాని రామస్వామి బాండు మేళంమాత్రం పెళ్ళి పందిటిలో వాయించడానికి వీలులేదు."

నేను తల ఊపాను. అంతకు మించి ఏంచేయగలం? ఆయన చివరకు రికార్డు వేసి అయినా పెళ్ళి జరిపించ మన్నారు. అంతే కాని రామస్వామి పందిట్లో అడుగు పెట్టడం పనికిరాదన్నారు.

భోజనానికి ఉండమంటున్నా ఆయన నిరాకరించి వెళ్ళిపోయారు.

ఇంత వరకు ప్రయత్నాలన్నీ నల్లేరు మీద బండిలా, నిరాటంకంగా సాగుతున్నాయి. అనుకోకుండా కొత్త సమస్య తలెత్తింది.

ఆ మధ్యాహ్నం, రామస్వామి మేళం వద్దని చెప్పే ముందు, మా మొదటి అసిస్టెంటుతో విషయం చర్చించాను.

ఆ చర్చలో ఈ అంశాలు పైకి వచ్చాయి.

రామస్వామి తాగుబోతు. అందుకు సందేహం లేదు. అతను బాగా తాగిన రోజులూ ఉన్నాయి. తాగని రోజులూ ఉన్నాయి. తాగిన రోజులలో బాగా వాయిస్తాడు. ఈ విషయం అందరికీ తెలిసిందే! తాగనప్పుడు అద్భుతంగా వాయిస్తాడు.

అయితే శాస్త్రీయ సంగీతమూ వాయించగలడు, ఇటు సినిమా పాటలూ వాయించగలడు.

క్లారినెట్, సాక్సోఫోను, ఫ్లూటు బాగా వాయిస్తాడు. మధ్య మధ్యను డ్రమ్ము మీద కూడా దెబ్బలు వాయిస్తాడు. కైపు హెచ్చయితే వాయిద్యాలు మానేసి గాత్ర సంగీతం మొదలెడతాడు.

చుట్టుపట్ల అంత మంచి మేళం ఎక్కడా లేదు. ఊళ్ళో సంగీతజ్ఞానముండే కుర్రాళ్ళను చేరదీసి వాళ్ళ కతను వాయిద్యాలు నేర్పుతున్నాడు.

అతనికి తాగుడు హెచ్చయితే భరించలేక భార్య పుట్టింటికి వెళ్ళిపోతుంది. అపుడు తాగుడు విపరీత మవుతుంది. అతని శిష్యు లెవరో పోయి ఆమెను పిలుచుకొస్తే అతను దారిలో పడతాడు.

అంటే, అతని భార్యకు, తాగుడికి ఏదో సంబంధ ముందన్నమాట?

రామస్వామి చాలా నమ్మదగినవాడు. ఒకరికి మాటిస్తే మరొక రింటికి పోడు. అన్నీ చర్చించిన తరువాత మా అసిస్టెంటు అన్నారు.

"రామస్వామి చదువు మానేసిన తరువాత ఆరు సంవత్సరాలు తంజావూరిలో, నాదస్వరం విద్వాన్ పొన్నుసామి పిళ్ళే దగ్గర శిష్యరికం చేశాడు. కాని, ఎవరింటా నాదస్వరం వాయించగా నేను వినలేదు."

ఏ దెలా ఉంటేనేం, అల్లుడి నోట్లో శని ఉన్నట్లు, అతను మా వియ్యంకులకు పనికి రాకుండా పోయాడు.

మేళం అక్కర్లేదన్న కబురు మా అసిస్టెంటు ద్వారా రామస్వామికి పంపుదా మనుకున్నాను. కాని, నా అంతరాత్మ ఒప్పుకోలేదు.

ఆ సాయంకాలం నేనే స్వయంగా రామస్వామి ఇంటికి బయలుదేరాను.

అతని ఇల్లు రామాలయానికి దగ్గరిలో ఉంది. అతను బాగా డబ్బు గడించినా పెంకుటిల్లు మాత్రం కట్టించలేదు. ఉన్న తాటాకుల ఇల్లు పెద్దది. వీథిలో విశాలమైన వరండా ఉంది. అక్కడ రెండు కుర్చీలు ఎప్పుడూ, వచ్చిన వాళ్ళ కోసం సిద్ధంగా ఉంటాయి.

ఇంటి గడపలో నిలబడి పిలిచాను."రామస్వామి!"

అతని భార్య పైకి వచ్చింది.

"బాబుగారా! రండి ! రండి? మావోడు స్నానం జేస్తున్నాడు. కూర్చోండి. ఇప్పుడే వస్తాడు."

ఆమె నడివయసులో ఉన్నా చాలా చక్కగా ఉంటుంది. ఆమె లేనప్పుడు రామస్వామి ఎందుకు హెచ్చుగా తాగేవాడో అప్పుడర్థమయింది.

మేళం కుదర్చడానికి వెళ్ళినప్పుడు ఆవిడ లేదు. పుట్టింటి కెళ్ళిందని అతనే చెప్పాడు. అతను బాగా తాగి ఉండటం చేత ఎదురుగా నిలిచి మాట్లాడడానికి సిగ్గు పడ్డాడు.

ఇప్పు డెలా ఉంటాడో!

మరో అయిదు నిమిషాలలో అతను వచ్చాడు. జరీ పంచ గూడకట్టు చుట్టుకున్నాడు. బనియను కూడా తొడుక్కోలేదు. బూజాల మీద జరీ కండువా కప్పుకున్నాడు. నాకు నమస్కారం చేసి ఎదుట నిలుచున్నాడు.

"గురువుగారూ! నమస్కారాలు. తమ రిలా వచ్చారేమిటి? కబురు పంపితే నేనే తమ దర్శనం చేసుకుందును కదా!" అన్నాడు రామస్వామి.

మనిషీ, మాటా స్వచ్ఛంగా ఉన్నాయి.

రామస్వామి నా దగ్గర తొమ్మిదో తరగతి వరకు చదువుకున్నాడు. అందుచేత నన్ను చనువుగా గురువుగారని పిలుస్తాడు. అయితే నేం, అతనితో మేళం అక్కర లేదని ఎలా చెప్పడం?

కాని చెప్పక తప్పదు.

"రామస్వామీ! నే నొక విషయం చెప్పడానికి వచ్చాను. దానిని ప్రస్తావించడానికి సిగ్గుగా ఉంది."

"గురువుగారూ! నా దగ్గిర తమకి బిడియం దేనికి?"

"అనుకోకుండా హఠాత్తుగా మా వియ్యంకులు మధ్యాహ్నం వచ్చారు. ఇంత వరకూ ఆయన ఏ షరతులూ విధించలేదు. బాండు మేళంవిషయంలో మాత్రం అతను చాలా పట్టుదలగా ఉన్నారు."

"చెప్పండి! చెప్పండి!"

"పెళ్ళికి రామస్వామి బాండు మేళం వద్దన్నారు."

"ఆయన అటువంటి నిర్ణయానికి రావడానికి ఏదో కారణం ముందక పోదు!" అన్నాడు రామస్వామి ఆలోచిస్తూ.

"క్రిందటి సంవత్సరం, అటు క్రిందటి సంవత్సరం నువ్వు వాయించిన పెళ్ళిళ్ళలో చాలా రసాభాస అయిందిట. మనింటి పెళ్ళికి యూనివర్సిటీ ప్రొఫెసర్లు, లెక్చరర్లే కాక, వైస్-ఛాన్సలర్‌గారు, రిజిస్ట్రారు గారు వస్తున్నారట. అందుచేత రామస్వామి బాండుమేళం పనికిరాదని ఆయన చెప్పారు."

ఈ మాటలు విని రామస్వామి చిన్నబోలేదు. నవ్వుతూ అన్నాడు. "గురువుగారూ! తమ వియ్యంకులు అన్నదానిలో తప్పేం లేదు. నేను కొంచెం శ్రుతి మించిన మాట వాస్తవమే!"

"నీ మేళానికి బేరం పోగొట్టినందుకు చాలా విచారిస్తున్నాను" అన్నాను నేను నీళ్ళు నములుతూ.

"అమ్మాయిగారి పెళ్ళి పందిట్లో చాలా ఘనంగా వాయించాలని ఎన్నో రోజులబట్టి కోరుకుంటున్నాను. వియ్యంకులుగారికి ఇష్టంలేని పని చెయ్యలేం కదా! నాకు బేరంపోయిందని తమరు విచారించకండి. నిన్ననే పెద్ద శెట్టిగారి అమ్మాయికి, ఆ రోజే పెళ్ళి నిశ్చయమయింది. ఎలాగైనా మేళం తెమ్మని అతను చెప్పారు. ఇప్పుడు వెళ్ళడానికి అవకాశం కలిగింది. తమ రేం బాధపడకండి."

రామస్వామి ఇంట్లోకి పోయి తిరిగి వచ్చాడు. అడ్వాన్సుగా నేనిచ్చిన రెండు వందలూ నా చేతిలో పెట్టి నమస్కారం చేశాడు.

ఏం చేయడం? అతనిని ఆశీర్వదించి ఇంటికి వెళ్ళిపోయాను.

ఈ షాక్ నుండి రెండు రోజులవరకు తేరుకోలేకపోయాను.

అంతవరకు సమస్య అన్నది ఎరుగను. రామస్వామిని వద్దన్న దగ్గిరనుంచి అది ఎదురయింది.

ఊరిలో అయిదారు మేళాలున్నాయి. ఎవరేనా వస్తారు. వాళ్ళందరినీ కలిసాను. అందరూ కుదిరిపోయారు. ఎవరూ ఖాళీగా లేరు.

రోజు రోజుకి పెళ్ళి దగ్గర పడుతోంది

నేనే స్వయంగా విజయనగరం వెళ్ళాను. తెలిసిన ఒకతనిని మేళం తెమ్మన్నాను.

"వెంకటేశ్వర్లు మాస్టారుగారూ! మా రామస్వామిని మీరు కాదన్నారు. ఈ వార్త మా వాళ్ళందరికీ తెలిసిపోయింది. ముందు ఒకరిని కుదుర్చుకొని మధ్యంతరంగా వాళ్ళని వద్దనడం మేము అవమానంగా త లుస్తున్నాం. రామస్వామికే ఇటువంటి అమర్యాద జరిగినందుకు మేమందరం చాలా విచారిస్తున్నాము. ఒకవేళ మేమెవరమయినా ఖాళీగా ఉన్నా మీ ఇంటి పెళ్ళికి మాత్రం వాయించం."

కుండ బద్దలు కొట్టినట్లు అతను చెప్పాడు.

మరి నలుగు రయిదుగురు బాండ్ మాస్టర్లను కలిసిన తరువాత అతను చెప్పినది అక్షరాల నిజమని నమ్మక తప్పలేదు.

నా కున్నదే ఒక్క అమ్మాయి. చాలా గొప్పగా వివాహం చేద్దా మనుకున్నాను. పందిరి వెయ్యడానికి, పెళ్ళికూతుర్ని చేయడానికి తోటలో దిగడానికి ఒక టేమిటి - అన్నిటికీ మంగళ వాద్యాలు కావాలి. ఏమీ లేనివాళ్ళుకూడా ఏదో విధమైన మేళం పెట్టుకుంటారు. మరి నలుగురిలో గౌరవంగా బ్రతుకుతున్న నా వంటి వాడికి వేరే అవమానం ఏముంది?

బజార్లో చెట్టు కింద కుర్చీ వేసుకొని ఉదయంపూట క్షవరాలు చేస్తూ, తీరికున్న సాయంకాలల్లో అపశ్రుతులతో సన్నాయి వాయించడం సాధన చేసే వెంకటస్వామిని బ్రతిమాలాను. డబ్బాశ చూపాను.

ససేమిరా కాదన్నాడు. అతను కూడా!

ఏం చేయడం?

పెళ్ళింకా అయిదు రోజులే ఉంది.

నాకు మతి పోయింది.

జీవితంలో నే నింతవరకు అపజయమెరుగను. చిన్న విషయంలో ఓడిపోయాను.

ఏం చేయడం?

ఆడపిల్ల పెళ్ళి!

మా ఊళ్ళో రామాస్వామి తరువాత పేరున్న బాండ్ మాస్టర్ పెద్దబ్బాయి దగ్గిరకి పోయి కాళ్ళా వేళ్ళా పడ్డాను. అతను నా పరిస్థితిని చూసి ఒకటన్నాడు:

"బాబుగారూ! దీనిలో మే మెవరం జోక్యంచేసుకోలేం. మీరు రామస్వామి దగ్గిరకే పొండి. అతనే మీకు మరో ఏర్పాటు చేయగలడు."

రామస్వామి దగ్గిరికి పోకూడదనుకున్నాను, అయినా తప్పలేదు.

నా కున్న అహం చంపుకున్నాను.

నే నతని ఇంటికి వెళ్ళేసరికి రామస్వామి లేడు. అతని భార్య చాలా మర్యాద చేసింది. ఒక గంట తరువాత అతను తిరిగి వచ్చాడు. నన్ను చూసి నమస్కారంచేశాడు.

"గురువుగారూ! పెళ్ళి పనులన్నీ బాగా జరుగుతు న్నాయా? " అతనే ప్రశ్నించాడు.

"రామస్వామి! అన్నీ బాగానే ఉన్నాయి - ఒక్క మేళం తప్ప. ఉన్న ఒక్క పిల్లకి మంగళవాద్యాలు లేకుండా, గ్రామఫోను రికార్డులు వేసి పెళ్ళి జరిపించవలసిన స్థితికి చేరుకున్నాను. ఎక్కడికి పోయినా, ఎవరి నడిగినా కార్యం ఫలించలేదు. నువ్వే ఈ సమస్యను పరిష్కరించగలవని పెద్దబ్బాయి చెప్పి నీ దగ్గిరికి పంపించాడు."

అతను చాలా విచారించాడు.

"గురువుగారూ! నే నుండగా మీరింత శ్రమపడ్డారంటే నాకు చాలా బాధగా ఉంది. మీకు మంగళ వాద్యాలు కావాలి. పెళ్ళికి వచ్చే సరస్వతీ పుత్రులకు ఆనందం కలిగించే సంగీతం వద్దు. ఇది మీ వి య్యంకులు మీకు విధించిన శిక్ష!"

"రామస్వామి! అరిటాకు ముల్లు మీద పడ్డా, ముల్లు ఆకుమీద పడ్డా ఒకటే కదా! ఎవరి కేవి నచ్చకపోయినా ఆడపిల్ల తండ్రి ఒడి పట్టాలి. పది రోజులయి వెర్రెత్తినట్లు తిరుగుతున్నాను. అందుకోసం ఏదో ఒక మేళం ఏర్పాటు చెయ్యి. "

రామస్వామి క్షణం ఆలోచించాడు. "గురువుగారూ! మా పెద్ద మేళంనుండి ముగ్గురిని విడదీసి మీ ఇంటికి పంపిస్తాను. ఒకతను డోలు, అదే తమిళంలో తవిల్ అంటారు అది వాయిస్తాడు. మరొకడు శ్రుతికోసం బూర వాయిస్తాడు. మూడోవాడు. అతడేం సంగీత విద్వాంసుడు కాడు - అయినా సంప్రదాయం ప్రకారం పెళ్ళికి కావలసిన పాటలు వాయిస్తాడు. ముగ్గిరితో ఉన్న మేళం మీ ఇంటికి పంపిస్తున్నాను. మీకు చాలా శ్రమకలిగించినందుకు విచారిస్తున్నాను."

ఎంత ఆపుకుందామనుకున్నా కళ్ళంట నీళ్ళు తప్పలేదు.

డగ్గుత్తికతో సరిగా మాట్లాడలేకపోయాను

జేబులో రెండువందలు తీసి అతని చేతిలో పెట్టబోయాను. కాని అతను డబ్బు పుచ్చుకోలేదు.

"గురువుగారూ! బాండ్‌మేళం ఖర్చు మగపెళ్ళివారిది. మీరేం అడ్వాన్సు లివ్వద్దు. ఎంత ఇవ్వాలన్న ప్రశ్నకూడా లేదు. అమ్మాయిగారి పెళ్ళికి బేరాలు కూడానా!"

అతని సౌజన్యానికి నేను ఆశ్చర్యపోయాను. నిజానికి రామస్వామి నాకు మహోపకారం చేశాడు. అతడు కాని ఆ రోజు నా అండకు రాకపోతే నెర్వస్ బ్రేక్ డౌన్‌తో నేను కూలిపోయేవాడినే.

పెళ్ళి మరే ఆటంకాలు లేకుండా మొదలయింది. మగపెళ్లివారు ఉదయం ఏడు గంటలకు రెండు బస్సులలో చేరుకున్నారు. విడిదిలో దిగారు. ఫలహారాలు, కాఫీలు అయిన తరువాత తోటలో దిగారు.

అన్నీ సవ్యంగా జరిగి పోతున్నాయి.

అంత గొప్పగా చేస్తున్న పెళ్ళికి ఒక్కటే లోపం, సరియైన బాండుమేళం లేకపోవడం. వచ్చిన సన్నాయి మేళం ఏదో విధాంగా వుంది. అయినా అవి మంగళవాద్యాలు.

రమారమి పదిన్నర అయుంది.

స్నాతకానికి ఏర్పాటులు జరుగుతున్నాయి.

మా వియ్యంకులు నా దగ్గిరకి వచ్చి భుజం మీద చెయ్యివేసి అన్నారు.

"బావగారు! పెద్ద శెట్టిగారు నాకు శుభలేఖ పంపారు. ముహూర్తం పది నలభై అయిదుకి. ఒకసారి పోయి వద్దామా!"

నాకు కూడా శెట్టిగారు శుభలేఖ ఇచ్చారు. వాళ్ళ ఇల్లు కూడా అట్టే దూరం లేదు.

శెట్టి గారింట పెళ్ళి చాలా ఘనంగా జరుగుతోంది.

ఆకాశమంత పందిరి వేశారు.

భూదేవంత విశాలమైనచోట్ల కుర్చీలు వేశారు.

వందలకొద్దీ అతిథుల విచ్చేశారు.

పందిట్లో చాలా సందడిగా ఉంది.

రామస్వామి బాండుమేళం ఆ పందిరికే అలంకారంగా కనిపించింది. ట్రూపులో పదిహేను మంది ఉన్నారు. అందరూ విలువైన సూట్లువేసుకున్నారు. రామస్వామి తెల్లని సూటే కాకుండా బౌటై కూడా వేసుకున్నాడు. క్లారినెట్ వాయిస్తున్నాడు. వాయిస్తూ స్టెప్‌లు వేస్తున్నాడు. మధ్య మధ్యను వాయిద్య మాపి 'ఐ లవ్ యూ డార్లింగ్ !' అంటూ సినీమా హీరోకి మల్లే బ్రేక్ డాన్సు చేస్తున్నాడు.

వయసులో నున్న ఆడవాళ్ళు, యువకులు నవ్వుతున్నారు. వారి సంతోషానికి అవధులు లేవు. అతను వాళ్ళు ఆడమన్నట్లు ఆడుతూ పాడమన్నట్లు పాడుతున్నాడు.

ముహూర్తం వేళకి అన్ని వాయిద్యాలు ఆపించారు.

మేము అక్షతలు వధూవరుల మీద వేసి తిరిగి వచ్చాం.

మా పెళ్ళి పందిట్లో స్నాతకానికి ఏర్పాట్లు పూర్తయాయి. రామస్వామి మేళం నా కళ్ళ ఎదుట మెదలుతోంది. ఎంత నిండుగా ఉంది! ఎంత శోభించింది. !

అయినా మా వియ్యంకులతో ముఖప్రీతికి ఏదో అనక తప్పలేదు.

"అయ్యా! మీ రెందుకు రామస్వామి మేళం వద్దన్నారో నా కిప్పుడు అర్థమయింది. చవకబారు పాటలు, డాన్సులు పెద్ద వాళ్ళ దగ్గిర ఈ కుప్పిగంతులు బాగుండవు."

ఆయన జవాబు చెప్పలేదు.

నా అంతరాత్మ నన్ను పొడుచుకు తింది.

రామస్వామి పెట్టిన భిక్ష ఆ సన్నాయి మేళం.

సాయంకాలం ఏడు గంటలకు వైస్‌ఛాన్సులరుగారు కుటుంబంతో కారులో వచ్చారు.

మరొక్క పావు గంటలో మూడు బస్సులలో ప్రొఫెసర్లు, లెక్చరర్లు, రిజిస్ట్రారుగారు, వారి ఆఫీసులో పెద్దలు కుటుంబాలతో చేరుకున్నారు.

ఎనిమిది గంటలకు డిన్నరు ప్రారంభమయింది.

పదిన్నరకు మగ పెళ్ళి వారివి, అతిథులవి, ఆడపెళ్ళి వారిలో చాలా మందివి భోజనాలు అయిపోయాయి.

మగ పెళ్ళి వారు, అతిథులు తాంబూలాలు సేవించి పెళ్ళి పందిట్లో కుర్చీల మీద కూర్చున్నారు. సుబ్బయ్యగారి వంటలు, వలంటీర్ల వడ్డనలు అనుకున్న కంటే బాగా సమకూరాయి.

రమారమి పదకొండు గంటలవస్తోంది. ఏవో సరుకులు తీసుకురాడానికి శ్రీమతితో స్టోరు రూములోకి వెళ్ళాను.

"ఇప్పటి వరకు అన్నీ అనుకున్న దానికంటే బాగానే జరిగాయి. కాని ఒక్కటే కించ మిగిలిపోయింది?"

"ఏమిటది?" ఆమె అడిగింది.

"ఇంత పెద్ద పెళ్ళి పందిరికి సరియైన బాండుమేళం దొరకలేదు. అదొక్కటే."

"మీరు సంతోషించండి. దేవుడిలా రామస్వామి అడ్డుపడ్డాడు."

"అవునవును."

ఆమె వస్తువులు పట్టుకొని వెళ్ళిపోయింది.

నేను స్టోరు రూముకి తాళం వేస్తుంటే మైకులోంచి చెవులకేదో కొత్తగా వినిపించింది.

సన్నాయి మేళం వాళ్ళు ఒక మైకు వాళ్ళ ముందు పెట్టమన్నారు. వాయిస్తున్నది నలుగురికీ వినిపించి పందిట్లో సందడిగా ఉంటుందన్నారు. ఆ విధంగా ఏర్పాటు చేశాను.

వచ్చిన ముగ్గురిలో  బూర వాయించే వాడు కొంచెం వయసుమళ్ళినవాడు. తవిల్ వాయించే వాడు పడుచువాడు, నాదస్వరం వాయించే వాడు మాత్రం మధ్యవయస్కుడు. బూర వాయించే వాడు, నాదస్వరం వాయించేవాడు పంచలు కట్టుకున్నారు.  తవిల్ వాయిస్తున్నవాడు షరాయి వేసుకున్నాడు.

నాదస్వరం వాయించే అతని లో నా కిప్పుడు మార్పు కనిపించింది. ఇత నెవరో కొత్త వాడు.  అత్తాకొడలు అంచున్న ఖద్దరు పంచ కట్టుకున్నాడు. నిండు చేతుల చొక్కా తొడుక్కొని కొంచెం మడిచాడు. మడతలు పెట్టి ఇస్త్రీ చేసినవోణీ భుజాల మీద వేసుకున్నాడు. మద్య పాపిడి తీసుకున్నాడు. నుదుట తిలకం దిద్దుకున్నాడు. అతని చెవి పోగుల్లోని వజ్రాలు దీపాల వెలుగులో మెరుస్తున్నాయి. అతని కుడి చేతకి మణులు పొదిగిన బంగారు మురుగు కనిపిస్తున్నది. అతని చేతిలో నున్న నాదస్వరానికి బంగారు కట్లున్నాయి.

వాయించడంలో స్పష్టమైన మార్పు కనిపించింది.

నాదస్వరం మీద కళ్యాణిరాగంలో వర్ణం వాయిస్తున్నాడు.

ఇది పెళ్ళిపాట కాదు.

వింటూ నేను పెళ్ళిపందిట్లోకి వచ్చాను.

కుర్చీల మీద అందరూ సర్దుకుంటున్నారు.

వర్ణం తరువాత 'వాతాపి  గణపతిం భజే'  వాయించాడు.

పందిట్లో క్రమంగా నిశ్శబ్దం ఆవరించుకుంటున్నది.

స్వరానికి స్వరం, సంగతులకు సంగతులు అపూర్వంగా ఉన్నాయి.

అన్నిటికన్నా ముఖ్యంగా ఆ నాదంలో ఏదో అనిర్వచనీయమైన మాధుర్య ముంది.

తరువాత 'శోభిల్లు సప్తస్వర' వాయించాడు.

పెళ్ళివారు, అతిథులు, పెద్దలు, పిన్నలు-పురుషులు, స్త్రీలు-వృద్ధులూ, బాలురూ- అందరూ సమ్మోహనాస్త్రంలో  బంధింపబడ్డవారివలె చేష్టలు దక్కి నాద మాధుర్యంలో స్నాతులయారు.

'బంటురీతి కొలు వీయవయ్య'  'క్షీరసాగర శయన'  మొదలైన త్యాగరాజ కృతులే కాక పురందరదాసుని 'జగదోద్ధారణ' వాయించాడు. తరంగం వాయించాడు. అష్టపది వాయించాడు. జావళీ వాయించాడు. చివరకు తిల్లానా వాయించాడు.

ముహూర్తం సమీపిస్తుంటే వాయిద్యాలు ఆపమన్నారు-

గంధర్వలోకంలో విహరిస్తున్న సరస్వతీ పుత్రులందరూ అపుడు ఈ లోకంలోకి వచ్చారు.

మంగళసూత్ర ధారణ తరువాత పనులన్నీ తొందర తొందరగా ముగిశాయి.

వైస్ ఛాన్సెలరు , కుటుంబం కారులో వెళ్ళిపోయారు.

ప్రొఫెసర్లు, లెక్చరర్లు, రిజిస్ట్రారు మొదలైన వారు కుటుంబాలతో బస్సులలో వెళ్ళిపోయారు.

మిగతాకార్యక్రమాలూ, అప్పగింతలూ అయిపోయాయి.

మాఘ మాసమేమో చల్లని గాలి రివట పందిట్లో సంచరిస్తోంది.

తూర్పువేపు వెలుగులు తోచాయి.

పక్షుల కిలకిలలు వినిపిస్తున్నాయి.

ఉన్నట్లుండి స్పీకరులో రాగం వినిపించింది. అతను తూర్పువేపు తిరిగి రాగాలాపన చేస్తున్నాడు.

భైరవి రాగం ఆలపిస్తున్నాడు.

పెళ్ళికొడుకు, అతని అక్కలు, వియ్యపురాలు, వియ్యంకుడు- కుర్చీలు ఈడ్చుకొని కూర్చున్నారు.

పందిట్లోవాళ్లందరూ పనులు మాని పరవశత్వంతో నాదస్వరం వింటున్నారు.

పందిరిపక్కనే జామ చెట్టుంది. దాని కొమ్మమీద కూర్చున్న గోరువంకలు కిలకిలలు మాని, తలలూపుతూ నాద మాధుర్యాన్ని గ్రోలు తున్నాయి.

చేతనాచేతనాలను అతడు తన రాగాలాపనతో కట్టి పడేశాడు.

ఒక అరగంటలో సూర్యోదయ మయింది.

దానితో ఆలాపన ముగిసింది.

వివాహ మంగళం సుసంపన్న మయింది.

మా వియ్యంకులు, నేను అతనిని సమీపించాం.

"బాబూ! నువ్వెవరవో నాకు తెలీదు. రామస్వామి బాండుమేళం ఆపించినందుకు మా బావగారు చాలా విచారించారు. కాని ఆ లోటు నువ్వు తీర్చావు. నువ్వు నాదస్వర రహస్యం తెలిసిన వాడివి. మహా విద్వాంసుడివి. విశ్వవిద్యాలయం నుండి వచ్చిన మేధావులు నిన్ను వేనోళ్ళ మెచ్చుకున్నారు. మా వైస్ ఛాన్సెలర్ గారు తమ అభినందలు నీకు ప్రతేకంగా అందజేయమన్నారు. నీకు నే నెంత బహుమతిగా ఇచ్చినా అది తక్కువే అవుతుంది. నిన్ను యథోచితంగా గౌరవిస్తున్నాను. మనఃపూర్వకంగా ఆశీర్వదిస్తున్నాను."

ఎదురుగా నిలుచున్న అతను అంజలి ఘటించాడు.

నే నేదో చెప్పబోయాను. అతను వారించాడు.

మా బావగారు పారితోషికమూ, పంచెలచాపూ తేడానికి వెళ్తే అత నన్నాడు-

"గురువుగారూ! మీ బావగారి మనోఫలకంమీద తాగుబోతు రామస్వామి గాఢంగా నాటుకుపోయాడు. ఆ ముద్రను చెరపడం కష్టం మరెవరో విద్వాంసుడు వాయించాడన్న సంతృప్తి ఆనందం అలాగే ఉండనివ్వండి."

అతను మహా విద్వాంసుడే కాదు.

మనసులోని మర్మములు తెలిసినవాడు.

(ఆంధ్రజ్యోతి - దీపావళి సంచిక)

✡